క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తెలకపల్లి: మండల కేంద్రంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఎంపీటీసీ విజయలక్ష్మి, మండలంలోని పర్వతాపురంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లక్ష్మమ్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా భాస్కర్‌గౌడ్

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన వంగ భాస్కర్‌గౌడ్‌ను కొల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి బుధవారం నియమించారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన శివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన బాలికలకు గురువారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు బలరామకృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామయ్య కోరారు.

దుపట్లు అందజేత



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం హ్యూమానిటీ సొసైటీ అధ్యక్షుడు రమేష్ బెడ్లు, దుప్పట్లు, స్వెటర్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు వెంకటయ్య, ఫిరోజ్, బంగారి, అంజనేయులు, శ్రావణ్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాకు ఫ్యాన్ల వితరణ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ పల్లె దవాఖానాకు గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్‌గౌడ్ బుధవారం సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. సామాజిక సేవలో భాగంగా తనవంతు సహకారం అందించినట్లు దాత పేర్కొన్నాడు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనసూయ, రాములమ్మ, నాయకులు రుక్మద్దీన్, బీరయ్య, పరశరాములు, తిరుపతయ్య, తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



కల్వకుర్తి రూరల్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లికల్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న 16 కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్, బాలరాజు, వెంకటయ్య, శివకృష్ణ, యాదయ్య, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు



పెద్దకొత్తపల్లి: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ ఆఫీస్ ముట్టడికి బుధవారం ఎస్‌ఎస్‌ఏ జిల్లా ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళి, నాగరాజు, కుర్మయ్య, శివలింగం, అంజి, స్వామి పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం



ఉప్పునుంతలలో..



చారకొండలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదువుతుండగా ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని అభ్యంతరం తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఎటువంటి సమాచారం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని సభలో గళం విప్పారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కొన్ని శాఖల అధికారులు సమావేశాలకు రాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలా ఉంటే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మహిళా సంఘాల సమావేశాలు, ఐకేపీ ద్వారా అందిస్తున్న రుణాల గురించి సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పంచాయతీ నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కట్టా సరిత, శివుడు, లింగమయ్య, ఎంపీటీసీ మల్లేష్, ఎంపీడీఓ లక్ష్మణ్ రావు, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

చారకొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పనిచేయాలని ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతర ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గృహలక్ష్మి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. అంతకు ముందు సమావేశంలో ఎజెండాలో పొందుపరచిన అంశాలను అధికారులు వివరించారు. ఆర్‌అండ్‌బీ, కేజీబీవీ, ఇరిగేషన్, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీడీఓ అగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ ప్రమీల, ఎంఈఓ శంకర్, ఏఓ చిన్న హుస్సేన్, రైతు సమితి అధ్యక్షుడు యాదయ్య గౌడ్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



సమస్య వివరిస్తున్న విద్యార్థినులు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ బాలికల వసతి గృహంలో నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ విద్యార్థినులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ వసతి గృహంలో 100 మంది ఉన్నామని సరిపడ నీరు రావడం లేదని పేర్కొన్నారు. 10 రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందని గోడును వెల్లబోసుకున్నారు. గ్రామ పంచాయతీ నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ తహసీల్దార్ విద్యార్థినులకు హామీ ఇచ్చారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



తాడూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మణెమ్మ

తాడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటా వివరిస్తూ మండలంలోని ఐతోలు, పాపగల్లు ఆయా గ్రామాలలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గ్రామాల్లో శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో లోహిత్‌రెడ్డి, అంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్ మాదిగ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో బీజేపీ బస్తీబాట నిర్వహించారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మున్సిపాలిటీ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో బాలాజీ, రేణయ్య, కౌన్సిలర్ సుగుణమ్మ, జానకి, భరత్‌చారి పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం



అచ్చంపేటలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు ఏమిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, లోక్యానాయక్, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, పర్వతాలు, అమీనోద్దీన్, ఉస్సేన్, అంజనేయులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొత్తపల్లి శ్రీకాంత్ గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అమల దంపతులు బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సర్పంచ్‌పై దాడికి యత్నించిన వారిపై చర్యలు

దోమలపెంట: మండల కేంద్రం పంచాయతీ సర్పంచ్‌పై దాడికి యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈగలపెంట పోలీసులకు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సూచించారు. బుధవారం శ్రీశైలంలో స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో దోమలపెంటలో ఆయన పర్యటించారు. వైద్యం పూర్తిస్థాయిలో అందేందుకు మహిళా డాక్టర్‌ను ఏర్పాటు చేశారు. అంతర్గత రహదారులను పరిశీలించి నిధులను మంజూరు చేశారు. టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకుడు రాఘవేంద్రరెడ్డి, ఎస్‌కే భాషా, రాము, రమణారెడ్డి, విజయబాబు, సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ మహేష్, మాజీ ఎంపీటీసీ తిమ్మన్న, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో అభ్యున్నతి సాధ్యం

నాగర్‌కర్నూల్ రూరల్: ఐక్యతతో విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతి సాధ్యమని ఆ సంఘం జిల్లా నాయకుడు ఎం శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విశ్వబ్రాహ్మణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకరికొకరు సహకారంతోనే ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ చారి, కాకనూరి శ్రీనివాసాచారి, సురేందర్, ప్రభాకరాచారి, మల్లాచారి, కృష్ణాచారి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన



లింగాల: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో రూ.17 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం సర్పంచ్ కోనేటి తిర్పతయ్య పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ఆలయం చుట్టూ ప్రహరీ, ప్రాంగణంలో సీసీ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు.

ఎల్లూరు వాసికి రెండు డాక్టరేట్లు



కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన వుత్పల కృష్ణమోహన్ రెండు డాక్టరేట్లు పొందారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇంగ్లిష్, జ్యోతిష్యశాస్త్రం విభాగాల్లో డాక్టరేట్లు సాధించారు. ఏ కాగ్నిటివ్ స్టైలిస్టిక్ స్టడీ ఆఫ్ మెటఫర్స్ ఇన్ సెలెక్ట్ షేక్‌స్పియరిన్ ట్రాజెడీస్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను జార్ఖండ్ రాష్ట్రంలోని రాధా గోవింద్ యూనివర్సిటీ ఆయనకు ఇంగ్లీష్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. అదేవిధంగా శని గ్రహ దోషాలు, ప్రభావాలు అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ప్రాగ్ జ్యోతిష్ విశ్వ విద్యాపీఠం ప్రొఫెషనల్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

అమావాస్య పూజలు



వెల్దండ: దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య పురస్కరించుకొని శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోత్సవాలతో స్వామివారికి తైలాభిషేకం, అన్నాభిషేకం చేశారు. శివలింగాన్ని పత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, నరహరి శర్మ తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



తాడూరు: మండల కేంద్రంతో పాటు పాలుమూరు, యాదిరెడ్డిపల్లి గ్రామాలను ఎంపీడీఓ గంగ మోహన్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పన్నులను వందశాతం వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామసభల్లో ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీలను ఏర్పాటు చేయాలి

బిజినేపల్లి: ప్రతి గ్రామంలో విశ్వబ్రాహ్మణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బజవోజు జయప్రకాష్ నారాయణచారి అన్నారు. బుధవారం మండలానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం, కార్పెంటర్లలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు భవన నిర్మాణ కార్మిక కార్డులు తీసుకోవాలని తీర్మానించారు. అందుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేసి త్వరితగతిన దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాకనూర్ శ్రీనివాసులు చారి, ఆర్ సురేందర్, శ్రీనివాస్‌చారి, శంకరాచార్యులు, ప్రభాకర్‌చారి, శ్రీకాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని కుమ్మెర గ్రామ సమీపంలో జరుగుతున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఇనుపరాడ్ల సామగ్రిని ఏర్పాటు చేశారు. కుమ్మెర గ్రామానికి చెందిన మాసయ్య ఇనుపరాడ్లను చోరీ చేస్తుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ గుర్తించి మాసయ్యను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

బిజినేపల్లి: మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నర్సరీ నిర్వాహకులకు ఎంపీడీవో కృష్ణయ్య సూచించారు. బుధవారం మండలంలోని కల్వకుంటతండా పంచాయతీలోని నర్సరీ, గ్రామ పంచాయతీ రికార్డులను, క్రీడా ప్రాంగణం స్థలాలను పరిశీలించారు. నర్సరీల్లో పెంచే మొక్కలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు.

బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి మొల్గర, పెద్దాపూర్, మామిళ్లపల్లి మీదుగా రాకొండ వరకు 20 కిలోమీటర్ల మేర ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం రూ. 3.50 కోట్లు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

చారకొండ: మండలంలోని గోకారం వాగు నుంచి తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం అనుమతి లేకుండా గోకారం వాగు నుంచి ఇసుక తరలిస్తునట్లు అందిన సమాచారం మేరకు ఇసుక లోడ్‌తో ఎర్రవల్లి రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా స్వాధీనం...



మన్ననూర్: మన్ననూర్–అమ్రాబాద్ ప్రధాన రహదారిలో బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజ్, సతీష్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. మొల్కమామిడి గేటు వద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన బాల్‌రాం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 14 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుబడ్డాడు. సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐలు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆధార్, ఓటీపీ నంబర్లు ఎవరికి చెప్పొద్దన్నారు. ఎవరైనే వేధిస్తే డయల్ 100 సమాచారం ఇవ్వాలని కోరారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సభకు అనుమతివ్వాలని వినతి



మున్సిపల్ మేనేజర్ అనితకు వినతిపత్రం అందిస్తున్న బీఎస్పీ నాయకులు

అచ్చంపేట రూరల్: బీఎస్పీతోనే సామాజిక న్యాయం వస్తుందని జిల్లా ఇన్‌చార్జ్‌లు యోసేఫ్, నాగన్న, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. సెప్టెంబర్ 10న అచ్చంపేటలో నిర్వహించే నల్లమల నగారా బహిరంగ సభకు అనుమతినివ్వాలని కోరుతూ బుధవారం అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి భారీ జన సమీకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, శ్రీనివాసులు, నాగార్జున, ఈశ్వర్, మల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఉప్పునుంతల: ఈనెల 19న తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తపస్ జిల్లా కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ ఉపాధ్యాయులను కోరారు. బుధవారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో కాంప్లెక్స్ హెచ్ఎం హన్మంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడంతోపాటు ఉపాధ్యాయ, విద్య సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలో బుధవారం అచ్చంపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ మోపతయ్య ఆధ్వర్యంలో టీడీపీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రామనాథం, ఎండీ నిరంజన్, కోశాధికారిగా మునీర్ సభ్యులుగా బాలయ్య, రాములు, ఖాజా, అఖిలేష్‌లు ఎన్నికయ్యారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కోడేరు: మండలంలోని నాగులపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రాజమౌళిక ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కురుమూర్తి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పరుశరాముడు, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా శివ, ప్రచార కార్యదర్శిగా వెంకట్రాములు, రవికృష్ణ, అధికార ప్రతినిధిగా వీరపాగ వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులుగా బాలస్వామి, రమేష్, శివ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

మొండికుంటపై సర్వే



వెల్దండ: మండలంలోని పోతేపల్లి రెవెన్యూ శివారులో ఉన్న మొండికుంటను అధికారులు బుధవారం పరిశీలించారు. పోతేపల్లి శివారులోని సర్వే నెంబర్లు 90–ఏ, 89–ఏ, 90–ఏ1లలో వెంకట్‌నారాయణ నాయుడికి సంబంధించిన 6 ఎకరాల భూమి ఉంది. వర్షాకాలంలో మొండికుంటలో నీరుచేరడంతో వ్యవసాయపొలం పూర్తి మునిగిపోతుందని, కట్టను తొలగించాలని రైతు హైకోర్టులో కేసు వేశాడు. దీంతో కోర్టు నుంచి సర్వే చేయాలని ఆదేశాలు రావడంతో మండల అధికారులు సర్వే చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ తిరుపతి, సర్వేయర్ అనసూయ, ఆర్ఐ శైలజ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పనిచేస్తామని దండోరా రాష్ట్ర కార్యదర్శి యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని చౌటబెట్లలో దండోరా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలను నమ్మించి మోసం చేశాయన్నారు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో దండోరా ఆధ్వర్యంలో విశ్వరూప బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. చౌటబెట్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొల్లి మహేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా రాజు మాదిగ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా వెంకటస్వామిలను ఎన్నుకున్నారు.

జ్వరాలబారిన చిన్నారులు



లింగాల: మండలంలోని అవుసలికుంట గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు కొన్ని రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో బుధవారం చిన్నారులను వారి తల్లి దండ్రులు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కు వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చారు. చిన్నారులను అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. పరీక్షల తర్వాత వ్యాధిని నిర్ధారిస్తామని పేర్కొన్నారు. అవుసలికుంటలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రోజుల తరబడి జ్వరాలు తగ్గక పోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎరుకల అభ్యున్నతిని విస్మరించడం తగదు



ఎరుకల చేతి వృత్తులను పరిశీలిస్తున్న సంఘం నాయకులు

బల్మూర్: ఎరుకల అభ్యున్నతిని ప్రభుత్వం విస్మరించిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. ఎరుకల కులస్తుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న పాదయాత్ర గురువారం మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేవలం చేతి వృత్తుల వారిని మభ్యపెట్టేందుకు ప్రకటనలు చేయడం తగదని, దీనిని ఆచరణలో చూపాలని కోరారు. బుట్టల అల్లకం, పందుల పెంపకంతో ఎరుకల కులస్తుల జీవితాలు దుర్భరంగా తయారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు శివశంకర్, భూషన్న, మల్లేస్, సురేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో జారిపడి మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: బాత్‌రూంలో జారిపడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం తాడూరు మండల కేంద్రానికి చెందిన మహిళకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐదు రోజుల కిందట గర్భసంచికి సంబంధించిన శస్త్ర చికిత్స చేశారు. బుధవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో బాత్‌రూంలోకి వెళ్తుండగా జారికిందపడింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు.